క్లుప్తంగా

వైభవంగా పౌర్ణమి గరుడ సేవ



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి వారికి ఆశ్వయుజమాస పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీవారికి స్నపన తిరుమంజనం శనివారం విశేషంగా నిర్వహించారు. అనంతరం శ్రీమాన్ శ్రీచిత్రకవి శ్యాము ఆచార్య రామానుజదాసన్ గరుడాళ్వార్ మండపంలో వేంచేసిన గరుడాళ్వార్‌మూర్తికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారు గరుడవాహనంపై పట్టణంలోని రైల్వేస్టేషన్ పురవీధుల్లో దర్శనమిస్తూ భక్తులకు అభయప్రదానం చేశారు. ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

బంతికి గిరాకీ



నకరికల్లు: బంతి సాగు రైతులకు ప్రస్తుత ధర ఆశాజనకంగా మారింది. అయ్యప్ప మాలధారులు అధికంగా ఉండడంతో బంతిపూలకు భారీగా డిమాండ్ పెరిగింది. మండలంలోని చల్లగుండ్ల, చీమలమర్రి తదితర గ్రామాలలో రైతులు బంతి సాగు చేస్తున్నారు. వ్యవసాయ అధికారుల సూచన మేరకు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించిన రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. మండలంలో బంతిసాగు చేస్తున్న రైతులు బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి మొక్క రూ.3 చొప్పున బంతినారు దిగుమతి చేసుకుంటున్నారు. భారీగా పెట్టుబడులు లేకపోవడం, తక్కువ నీటితో పంట పండడంతోపాటు 40 రోజులకే తొలికాపు వస్తుండడంతో రైతుల ఆదాయం మెరుగుపడుతుంది. దాదాపు రెండు నెలలకుపైగా పంట వస్తుండడంతో నిత్య ఆదాయ వనరుగా మారిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాటుసారా కాచే సామగ్రి స్వాధీనం



అచ్చంపేట: ఇటీవల కాలంలో మండలంలోని మాదిపాడు, గింజుపల్లి, జడపల్లితండా, కంచుబోడుతండా, సంద్ర తండాల పరిధిలోని అడవులలో కొంతమంది నాటు సారా కాస్తూ, పోలీసులు దాడులు నిర్వహించే సమయంలో పరారవ్వగా నాటుసారా కాయడానికి ఉపయోగించే పెద్ద పెద్ద స్టీల్ బిందెలు, డ్రమ్ములు తదితర వస్తువులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం అవి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచారు.

దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): విధుల్లో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు ఆదివారం నిరసన తెలిపారు. కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై 14 మంది దుండగులు దాడి చేసి గాయపరిచారన్నారు. నిరసనలో భాగంగా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. నిరసనలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు భాస్కరరావు, ఎంబీకే సాహెబ్, జవహర్, ఎస్ఎంయూ నాయకులు నాగేశ్వరరావు, సుధాకరరావు, జిల్లా నాయకులు రమణారెడ్డి, యలమంద తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): మాస్టర్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు పలువురు ఎంపికయ్యారు. గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో 29వ తేదీన జరిగిన పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా తరపున రన్నింగ్ విభాగంలో పీడీ శేషయ్య, శ్రీనివాసరెడ్డి, 75 సంవత్సరాల షాట్‌పుట్ విభాగంలో పాతూరి రామకోటయ్య, 50 సంవత్సరాల విభాగంలో కే ప్రేమ్‌కుమార్‌లు ఎంపికయ్యారు.

మహిళ అదృశ్యం

నరసరావుపేట టౌన్: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వనటౌన్ సీఐ అశోక్ కుమార్ ఆదివారం తెలిపారు. రామిరెడ్డిపేటకు చెందిన గోరె మల్లేశ్వరమ్మ ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తున్నట్లు సీఐ తెలిపారు.

మళ్లీ సీఎంగా జగనే ఎందుకు కావాలో ప్రజలకు వివరించండి

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- నవంబర్ 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వై ఏపీ నీడ్స్ జగన్



రాజుపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి అంబటి

రాజుపాలెం: మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకులు అందరు కలసి గ్రామాలకు వెళ్లండి గత నాలుగున్నర ఏళ్లుగా ప్రజలకు పారదర్శకంగా అందించిన సంక్షేమ అభివృద్ధిపై అవగాహన కల్పించండి, జగనే మళ్లీ సీఎం ఎందుకు కావాలో వారికి తెలియజెప్పండని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ మళ్లీ జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలో, జగన్ వస్తే సంక్షేమం ఎలా కొనసాగిస్తారో ప్రజలకు మనం తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికే ప్రజల్లో జగన్ పట్ల స్పష్టమైన అవగాహన, ఆదరణ ఉందని, దానిని మనం చైతన్యం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఏ పార్టీకి లేని సైన్యం మనకు ఉందన్నారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు అందరు సమిష్టిగా ప్రజల వద్దకు వెళ్లి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నవంబర్ 9వ తేదీ నుంచి ప్రకటించిన షెడ్యూల్ వారీగా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రతీ గ్రామ సచివాలయంలో జరిగే కార్యక్రమానికి ఆరోజు సాయంత్రం ఎంపిక చేసిన గ్రామ సచివాలయానికి మండల స్థాయి నాయకులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఏర్పాటు చేసిన సంక్షేమ అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించి, ప్రదర్శించి లబ్ధిదారులకు వివరించాలని తెలిపారు. ఆరాత్రికి ఆ గ్రామంలోనే స్థానికులతో మమేకమై భోజనాలు చేసి రాత్రి అక్కడే బస చేయాలని సూచించారు. మరుసటి రోజు ఉదయం ఎంపిక చేసిన ప్రాంతంలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ చేసి నాయకులందరు ఇంటింటికి వెళ్లి పార్టీ అందించే సమాచారాన్ని తెలియజెప్పడం చేయాలన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నియోజకవర్గంలో విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాసు లింగారెడ్డి, ఎంపీపీ తెలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ అధ్యాపక రాష్ట్ర అధ్యక్షులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్, సర్పంచ్ పులిబండ్ల అశోక్, క్రాంతి పథకం మండల సమైక్య అధ్యక్షురాలు సిలార్‌బీ, సర్పంచ్ కొర్రకూటి వెంకాయమ్మ, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఎస్కే జానీ, నెమలిపురి ఎంపీటీసీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలను నిలబెట్టుకొన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): ప్రతి పేదవాడు సంతోషంగా ఉండాలనే తాపత్రయంతో పనిచేస్తూ, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని శ్రీసాయిబాబా గుడి ఆవరణలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి హాజరైన మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతు రుణమాఫీ అని చెప్పి మోసం చేసిందన్నారు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రతి పేదవాడి పిల్లలను బడికి పంపించేలా నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తూ వాటి రూపురేఖలు మార్చేశారన్నారు. అమ్మ ఒడి, రైతుభరోసా సాయం, కాపు నేస్తం పార్టీలకు అతీతంగా అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించిన మహానుభావుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అయితే, రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. ఎవరూ చేయని విధంగా ప్రతి ఇంటికీ ఆరోగ్యసేవలందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేశారన్నారు. కుల మతాలకు, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించామన్నారు. రాష్ట్రంలో 82% కుటుంబాలకు ప్రభుత్వం నుంచి మేలు జరిగిందన్నారు. మేలు జరిగితేనే నాకు ఓటు వేయండని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని వలంటీరు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో ఎంతమేర అభివృద్ధి జరిగిందో ప్రజలకు వివరిస్తారన్నారు. 13 సచివాలయాల్లోను ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి పనులపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేసి రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేదలకోసం నిరంతరం పనిచేస్తున్నారని అన్నారు. టీడీపీ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తుందని, వైఎస్సార్ సీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి సమర్థవంతంగా పనిచేసి వైఎస్సార్‌సీపీ గెలుపుకు కృషి చేయాలన్నారు. గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, వైస్ చైర్మన్ కళ్ళం శివరామిరెడ్డి, ఎంపీపీ మారూరి పద్మ, జెడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, జేసీఎస్ మండల కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురువుకు వందనం



అచ్చంపేట: తమకు విద్యాబుద్ధులు నేర్పి, చదువుకునేందుకు ఆర్థిక సహాయం చేసి, సమాజంలో ఉన్నత పౌరులుగా తీర్చి దిద్దిన గురువులు రెవరెండ్ ఫాదర్ ఏరువు ఇన్నయ్యను స్మరించుకుంటూ శిష్యబృందం మండలంలోని తాళ్లచెరువు బాలయేసు చర్చి ఆవరణలో స్మంసరణ సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా ఫాదర్ ఇన్నయ్య చిత్రపటానికి శిష్యబృంద సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిత్రపటానికి గ్రామ వీధులలో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఫాదర్ పిల్ల అంతోని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇన్నయ్య మాస్టారు 1977 నుంచి 1984 వరకు ఫిరంగిపురంలోని సెయింట్ పాల్స్ హైస్కూలు కరస్పాండెంట్‌గా పనిచేశారన్నారు. ఆ సమయంలో విద్యార్థులకు అన్నీ తానై కావలసిన సౌకర్యాలన్నీ కల్పించినట్లు చెప్పారు. ఉచితంగా భోజన సదుపాయాలతో పాటు విద్యార్థులకు విద్యాబోధనచేసి సమాజంలో గుర్తింపు వచ్చే విధంగా తీర్చిదిద్దారన్నారు. ఆయన శిష్యులలో తాళ్లచెరువుకు చెందిన అనేక మంది దేశవిదేశాలలో స్థిరపడినట్లు చెప్పారు. 300 మంది కిపైగా ప్రభుత్వ ఉద్యోగాలలో పనిచేస్తున్నారని, 18 మంది గురువులుగా ఉన్నారన్నారు. ఆయన కాలంలో జాతీయ స్థాయిలో ఖోఖో, హాకీ వంటి క్రీడలలో అవార్డులు పొందినట్లు చెప్పారు. అలాంటి మహోన్నత వ్యక్తిని స్మరించుకునే అవకాశాన్ని కల్పించిన పీఈటీ ఏరువు రాజారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్ అంతోనిరాజు, చర్చి పెద్దలు, గ్రామ ప్రముఖులు, చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మా శౌర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సరిహద్దు మాదిపాడులో పోలీస్ నిఘా



మాదిపాడులో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ వీరాస్వామి, ఎస్ఐ మణికృష్ణ తదితరులు

అచ్చంపేట: తెలంగాణాలో జరగబోయే 2023 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన మాదిపాడు వద్ద నగదు, మద్యం, విలువైన వస్తువులు అక్రమ రవాణా జరుగకుండా ఆదివారం పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెదకూరపాడు సీఐ వీరాస్వామి మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సరిహద్దులో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెలంగాణాలో ఎన్నికలు అయిపోయేంతవరకు పులిచింతల ప్రాజెక్టుపై నుంచి గాని, బల్లకట్టుపై నుంచి గాని తెలంగాణ రాష్ట్రానికి ఏ విధమైన వస్తువులు రవాణా చేయడానికి వీలు లేదని, అత్యవసర పరిస్థితులలో తీసుకెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా పోలీసు వారి అనుమతులు తీసుకోవాలన్నారు. మాదిపాడు నుంచి బైకులపై, కార్లలో మద్యం, డబ్బు ఇతర ఆకర్షణీయమైన వస్తువులు ఏమైనా తీసుకెళుతూ పట్టుబడితే నాన్‌బెయిలబుల్ కేసులు బుక్‌చేసి అరెస్ట్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. పులిచింతల ప్రాజెక్టు, బల్లకట్టు, పడవరేవుల వద్ద 24/7 పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మాదిపాడు, కంచుబోడుతండా, గింజుపల్లి తదితర గ్రామాలలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ, అచ్చంపేట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లికి బోనం సమర్పణ



మాచవరం: మండలంలోని వేమవరం గ్రామంలో గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి గ్రామస్తులు ఆదివారం ఘనంగా బోనాలు సమర్పించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో తలపై బోనాలు ధరించి, గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా దేవాలయానికి తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలు చేపట్టారు. విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. కుంకుమ బండ్లు ఏర్పాటు చేసి, గ్రామంలో ఊరేగించారు. బంధుమిత్రులు రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమాజ సేవకు చేయూత

చిలకలూరిపేట: సమాజసేవకు తమవంతు చేయూతనందించాలన్న ఆలోచన అభినందనీయమని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు ఇందిర చెప్పారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీవీ సుబ్బారావు, ఇన్నర్‌వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు విజయలక్ష్మి దంపతులు అందించిన ఆర్థిక సహాయంతో పేద మహిళ సునీతకు కుట్టుమిషన్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ క్లబ్ సభ్యులు అందించిన ఆర్థిక సహాయాన్ని ఉపయోగించుకొని జీవనోపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షురాలు గట్టు సరోజిని, యూ.రమాదేవి, ఎన్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నూతన ప్రార్థన మందిరం ప్రారంభం



వినుకొండ(నూజెండ్ల): పవిత్రమైన ప్రార్థన మందిరం ప్రారంభోత్సవంలో పాల్గొనడం తన అదృష్టమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలం చెరుకుంపాలెం గ్రామంలో నూతనంగా నిర్మాణమైన చర్చిని ఆయన శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువు చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడిచి శాంతియుతంగా జీవించాలని అన్నారు. మన ప్రాంతంలోని ప్రతి కుటుంబంపై ఏసుక్రీస్తు దీవెనలు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంకరరావును విమర్శించే అర్హత కొమ్మాలపాటికి లేదు



సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు

అమరావతి: తెలుగుదేశం పార్టీ హయాంలో అక్రమ ఇసుక తవ్వకాలతో కోట్ల రూపాయలు దోచుకుని, ఇరవై మూడుమంది మరణానికి కారణమైన మీరు అవినీతి గురించి మాట్లాడుతుంటే జనం నవ్వుకుంటున్నారని క్రోసూరు ఎంపీపీ పి.కోటయ్య అన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అబద్ధాలతో, అవినీతితో పరిపాలన సాగించిన మీకు అభివృద్ధి, సంక్షేమాలతో ప్రజల మనస్సులలో నిలిచిన నంబూరు శంకరరావుకు పోలిక లేదన్నారు. అలాగే టీడీపీ హయాంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరిపితే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వందకోట్ల రూపాయలు జరిమానా విధించిన విషయం అప్పుడే మరిచిపోయారా అన్నారు. అలాగే కొమ్మాలపాటి శ్రీధర్ తాను శాసనసభ్యుడిగా పనిచేసిన పది సంవత్సరాలలో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. నిస్వార్థంగా అభివృద్ధే ధ్యేయంగా, అవసరమైతే తన సొంత నిధులతో ప్రజలకు సాయం అందిస్తున్న మంచి వ్యక్తి శంకరరావుపై నిత్యం అవాస్తవాలు మాట్లాడటం అలవాటుగా మారిందన్నారు. కార్యకర్తలను రెచ్చగొట్టి గ్రామాలలో గొడవలు సృష్టించాలనే టీడీపీ ఎత్తుగడలు సాగవన్నారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి నిస్సిగ్గుగా అబద్ధాలు ఆడటం, వ్యక్తిగత విమర్శలు చేయటం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. మండల వైఎస్సార్ జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు మాట్లాడుతూ కొమ్మాలపాటి శంకరరావుపై ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాడని బురదచల్లటం దయ్యాలు వేదాలు వల్లించటమేనన్నారు. అమరావతి మండలం దిడుగులో అక్రమంగా వందల కోట్ల రూపాయలు ఇసుక దోచుకుంటుంటే వైఎస్సార్‌సీపీ నాయకులు కోర్టు నుండి స్టే తెచ్చి నీ అక్రమ ఇసుక దందాను ఆపింది నిజం కాదా అన్నారు. నియోజకవర్గ ప్రజలకు నిరంతరం సేవ చేయాలనే తపనతో పనిచేస్తున్న శంకరరావుపై విమర్శలు చేసే అర్హత లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి నండూరి కరుణకుమార్ మాట్లాడుతూ గతంలో అమరావతి మండలంలో ఎస్సీల పేరు మీద బ్యాంకులలో అప్పులు తీసుకుని జేబులు నింపుకుంది టీడీపీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యే శంకరరావుపై అవాకులు, చవాకులు మాట్లాడితే ప్రజలు వచ్చే ఎన్నికలలో తగిన శాస్తి చేస్తారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలా లక్ష్మీనారాయణ, చిల్కా సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను వ్యతిరేకించండి

ప్రజామేనిఫెస్టో పోస్టర్ల ఆవిష్కరణలో సీపీఎం



క్రోసూరు: ఆంధ్రాకి ద్రోహం చేసిన బీజేపీకి రాష్ట్ర రాజకీయపార్టీలు అనుకూలంగా వ్యవహరించటం దుర్మార్గమని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి బి.విజయ్‌కుమార్ అన్నారు. సీపీఎం పెదకూరపాడు నియోజకవర్గంలోని పార్టీ సభ్యులు సానుభూతిపరుల జనరల్‌బాడీ సమావేశంలో బి.సూరిబాబు అధ్యక్షతన స్థానిక ఆమంచి విజ్ఞాన భవనంలో ఆదివారం జరిగింది. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రానికి తెలుగు ప్రజలకు మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందన్నారు. విభజన హామీలు ఏపీ అమలు చేయకుండా పోలవరం నిర్మాణాన్ని చేపట్టకుండా, విశాఖ ఉక్కును అమ్మాలని చూడటం, తెలుగు జాతి ప్రజలను మోసం చేయటమేనని అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టకుండా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా చేస్తూ పట్టీ పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. భారతదేశంలో నిరుద్యోగాన్ని పారదోలటానికి సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని వాగ్దానం చేసి, పెద్ద నోట్లు రద్దు దేశంలో కోట్లాది మంది ఉపాధి లేకుండా చేయటానికి కారణమైందన్నారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని దేశ ప్రజానీకం వ్యతిరేకించకుండా ఉండటానికి దేశంలో అన్నదమ్ముల్లాగా జీవిస్తున్న వారి మధ్య కుల మత భావనలను రెచ్చగొట్టి చిచ్చుపెట్టే కుట్రలు చేస్తుందన్నారు. ఇటువంటి దుర్మార్గమైన బీజేపీ విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. అవకాశవాద పార్టీల వైఖరికి ప్రత్యామ్నాయంగా సీపీఎం ప్రజా మేనిఫెస్టో ఆధారంగా సమగ్ర అభివృద్ధి జరగాలని రాష్ట్ర వ్యాప్తంగా మూడు చోట్ల నుంచి బస్సు యాత్రలు నిర్వహిస్తుందన్నారు. నవంబర్ 7వ తేదీ సత్తెనపల్లిలో, 15వ తేదీ విజయవాడలో జరగనున్న బహిరంగ సభల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రజా మేనిఫెస్టో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు పార్టీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత



దాచేపల్లి : మండలంలోని గామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆంధ్రా సిమెంట్ ప్రాంగణంలో సాగర్ సిమెంట్ ఫౌండర్ చైర్మన్ సమ్మిరెడ్డి వీరారెడ్డి స్మారక స్కాలర్‌షిప్‌లు ఆదివారం అందజేశారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 2022–23 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.20వేలు, ద్వితీయ స్థానానికి రూ.15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10వేల నగదు, మెమెంటోలను 27మంది విద్యార్థులకు ఎంఈవో రాజకుమారి, ఫ్యాక్టరీ హెడ్ పి.బిక్షమ్మరెడ్డి చేతుల మీదుగా అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకుందని, ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో పాటుగా తమ వంతు సహకారం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అందిస్తామని ఫ్యాక్టరీ హెడ్ బిక్షమ్మరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో జీఎంలు ఎంవీ సత్యసాయి, సుబ్బారెడ్డి, రామకృష్ణా, సీఎస్‌వో కొండారెడ్డి, వీర ప్రకాష్, ఫ్యాక్టరీ ప్రతినిధులు రామకృష్ణా, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం



వేల్పూరులో నిర్మాణ దశలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషను

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ సమీపాన ప్రభుత్వ భూమి ఎకరం స్థలంలో నూతనంగా రూ.4కోట్ల వ్యయంతో 33/11 కేవీ సామర్థ్యం కలిగిన విద్యుత్ సబ్ స్టేషను పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపాన అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధి నుంచి సబ్‌స్టేషను వరకు సస్‌పోల్స్ 45 విద్యుత్ స్తంభాల నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఈసందర్భంగా ఏఈ సంపెంగుల గాంధీ మాట్లాడుతూ నూతన సబ్‌స్టేషను పరిధిలో అనుసంధానం చేసే గ్రామాల్లో 200 విద్యుత్ స్తంభాలతో పాటు నూతనలైను పనులు ప్రారంభం అయ్యాయని, ఈనెలఖారులోగా పూర్తి అవుతాయన్నారు. తదుపరి విద్యుత్ సబ్‌స్టేషనులో యంత్ర పరికరాలు ఏర్పాటు పనులు జరుగుతాయన్నారు. త్వరతిగతిన పనులు పారదర్శకంగా పూర్తి అయ్యేలా క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టామన్నారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



సాగర్‌మాత ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగరమాత పుణ్య క్షేత్రానికి తరలివచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్షయ నిర్మూలనకు పటిష్ట చర్యలు

- శావల్యాపురం పీహెచ్‌సీకి రూ. 10 లక్షలు విలువ చేసే ఆధునిక పరికరం కేటాయించిన ప్రభుత్వం
- సులువుగా పరీక్షలు చేయవచ్చంటున్న వైద్యులు



శావల్యాపురం: క్షయ వ్యాధి నిర్మూలన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకుగాను ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహించే రూ.10 లక్షల విలువ చేసే ఆర్టీపీసీఆర్ (టీఆర్‌యూ) నూతన ఆధునిక పరికరాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ వ్యాధి లక్షణాలు కల్గియున్న వారి కళ్లె పరీక్షలు ఈ పరికరంతో చేయవచ్చని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ తెలిపారు. నిరంతరం రెండు వారాలకు మించి జ్వరం రావటం, బరువు తగ్గటం, దగ్గు, కళ్లెలో రక్తం పడటం, ఇతర లక్షణాలు ఉన్నవారు పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించే మందులు, పోషకాహార కిట్లు, క్రమం తప్పకుండా ఆరునెలల పాటు వాడితే వ్యాధిరాకుండా ఉంటుందని తెలిపారు. అలాగే వ్యాధి నిర్ధారణ అయిన రోగి వివరాలు నిక్షయ్ యాప్ ఆన్‌లైన్‌లో నమోదు చేయటం ద్వారా భవిష్యత్‌లో మరలా క్షయ వ్యాధికి గురైతే మెరుగైన వైద్యసేవలు చేయటానికి దోహదపడతుందన్నారు. క్షయవ్యాధి ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధి నియంత్రణ చేయవచ్చని తెలిపారు. క్షయ వ్యాధి సోకిన వారు దగ్గినప్పుడు, తుమ్మిన సమయంలో తుంపరలు ద్వారా అంటువ్యాధి రూపంలో ప్రబలుతుందన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ వైద్య పరీక్షలకు బహిరంగ మార్కెట్‌లో రూ.1,500 ఉంటుందని ఇలాంటి వైద్య పరీక్షలు ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. వ్యాధి లక్షణాలు గుర్తించి, ప్రభుత్వ పరంగా ఉచితంగా ఆరు నెలలు పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో వైద్యపరీక్షలు అందించటంతో పాటు పోషకాహారం తీసుకోవడం ద్వారా పూర్తి స్థాయిలో వ్యాధిని అదుపు చేయవచ్చన్నారు.